4.) **సుమతి శతకంలో గల లోకనీతిని వివరించండి ?**

**( లేదా)**

**సుమతీ శతక వైశిష్ట్యాన్ని తెలపండి?**

జ) తెలుగువారికి సుపరిచితమైన శతకాలలో సుమతీ శతకం ముఖ్యమైనది. వేమన శతకం కంటే ముందుగా 13వ శతాబ్దంలోనే వెలసిన శతకమిది. సుమతీ శతక కర్త బద్దెన. తెలుగు వారికి కొన్ని శతాబ్దాలుగా ఇలవేల్పు అయింది సుమతీ శతకం.

**విశిష్టాంశాలు:**

1) అందమైన కంద పద్యంలో వీనుల విందుగా చెప్పడం

2) భాష సారళ్యం

3) లోక నీతి, లోక రీతి

4) సాంఘిక విమర్శ

5) అనుభవం లో గల ఉపమానాలు, దృష్టాంతాలు వాడడం

**శతక వైశిష్ట్యం:**

“శ్రీరాముని దయచేతను

నారూఢిగ సకల జనులు నౌరా యనగా

ధారాళమైన నీతులు

నోరూరగ చవులు బుట్ట నుడివెద సుమతీ!”

అని శపథం చేసి, నిజంగానే రుచికరంగా నీతులు బోధించాడు. సమకాలీన వ్యవస్థని లోతుగా పరిశీలించిన కవి బద్దెన.

“కలకంఠ కంట కన్నీ

రొలికిన సిరి ఇంట నుండ నొల్లదు”

అంటూ స్త్రీలను బాధలకు గురి చేయకూడదన్నాడు. లోకంలోని వ్యక్తులను, మానసిక ప్రవృత్తులను బాగా పరిశీలించి నిర్భయంగా వాస్తవాలను వెల్లడించాడు.

“ఉపకారికి నుపకారము

విపరీతము గాదు సేయ వివరింపంగా

అపకారికి నుపకారము

నెపమెన్నక సేయువాడు నేర్పరి సుమతీ!”

అని ప్రబోధించాడు.

“ఎప్పుడు సంపద కలిగిన

నప్పుడు బంధువులు వత్తు రది యెట్లన్నన్

దెప్పలుగ చెఱువు నిండిన

కప్పలు పదివేలు చేరు గదరా సుమతీ!”

కంద పద్యమే అందమైన నడక కలది. సులభంగా నోటికి వచ్చేది. దానికి బద్దెన మరింత సొగసును కల్పించాడు. ఏనుగంత భావాన్ని కంద పద్యంలో ఇమిడ్చిన ప్రతిభావంతుడు. బద్దెన తన భావానికి తగిన భాషనీ, దృష్టాంతాలను ఎన్నుకొని ప్రజల మనసులలోకి నాటాడు.

బధిర శంఖారావం, వెన్నెల లేని రాత్రి, చెరుకు పిప్పి, పారని గుర్రము వంటి వాటిని ప్రయోగించాడు. కుట్టకపోతే తేలును పురుగు అంటారట. అలాగే నీళ్ళు నిండిన చెరువులోకి కప్పలు రావడాన్ని , సంపదలు ఉన్నప్పుడు బంధువులు రావడంతో పోల్చి చెప్పడం బద్దెన విశిష్టత.

శతక పద్యాలలోని చాలా పాదాలు సామెతలుగా ప్రజల నాలుకలపై నాట్యమాడాయి, నాట్యమాడుతున్నాయి.